క్లుప్తంగా

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



పుట్ట పెద్దమ్మను దర్శించుకుంటున్న భక్తులు

బేతంచెర్ల: స్థానిక బనగానపల్లెకు వెళ్లే రహదారిలో వెలసిన పుట్ట పెద్దమ్మకు జ్యేష్ఠ మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, మహామంగళహారతి ఇచ్చారు. అదేవిధంగా అమ్మవారి శాలలో వాసవీ మాతకు, కొలుములపల్లె రహదారిలోని చౌడేశ్వరీ దేవి, సిమెంట్ నగర్ గ్రామ సమీపాన వెలసిన సుంకులా పమేశ్వరీ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జీవో 117ను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాధవస్వామి

బనగానపల్లె : ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసే జీవో నంబరు 117ను వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం మధుసూదన్‌రావు, జిల్లా అధ్యక్షులు మాధవస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఏపీటీఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే అమలుపరచే విధంగా చర్యలు తీసుకొగలిగితే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులుగా మూడవసారి ఎన్నికైన మాధవస్వామి, రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన మధుసూదన్ రావును సన్మానించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్షులు వెంకటకృష్ణుడు, నాయకులు రామక్రిష్ణ, సుబ్బరాయుడు, గోవింద నాయక్, ఓబులేసు, రమేష్, సుంకన్న, బాలాజీ నాయక్, శేఖర్, రెహమాన్, కృష్ణయ్య, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి ఐటీఐలలో ప్రవేశాలు

డోన్ టౌన్ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశాలకు ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించి సీట్ల కేటాయిస్తామని జిల్లా కన్వీనర్, డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ ప్రాతిపదికన సీటురాని వారికి 24వ తేదీన ఉమెన్స్ కోటా, మేనేజ్‌మెంట్ కోటాలో సీట్లు పొందవచ్చు అని చెప్పారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఉదయం 9గంటల నుంచి 11 గంటలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4గంటల వరకు మూడురోజుల పాటు వారు సాధించిన జీపీఏ మార్కులను ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే విద్యార్థులు దరఖాస్తు సమయంలో వారు ఇచ్చిన సెల్ ఫోన్ల నంబర్లకు ఎస్‌ఎంఎస్ పంపడం జరిగిందన్నారు. పూర్తి వివరాలకు స్థానిక ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలని సూచించారు.

స్టాంప్ వెండర్ మృతి

ప్యాపిలి: పట్టణానికి చెందిన స్టాంప్ వెండర్ గురుప్రసాద్ (68) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. 1997 నుంచి స్టాంప్ వెండర్‌గా పని చేస్తున్న గురుప్రసాద్ మృతి పట్ల సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాసులు, కార్యాలయ సిబ్బంది ప్రసాద్, సుజాత, సుధీర్ తదితరులు సంతాపం తెలిపారు.

రేపు ఆలయ భూములకు వేలం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బ్రహ్మనందీశ్వరస్వామి, కాళికాంబ చంద్రశేఖరస్వామి ఆలయ భూములు, షాపులకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఆలయ ఆవరణలో వేలం పాట జరుగుతుందని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు రూ.2 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు. మూడేళ్ల కాలపరిమితికి కౌలుకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానం షాపులకు ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాటదారుడు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు. షాపుల అద్దె కాలం మూడేళ్ల వరకు ఉంటుందన్నారు.

నీట్ అవకతవకల నిగ్గు తేల్చాలి

నంద్యాల(న్యూటౌన్): వైద్య సీట్ల భర్తీకి నిర్వహించే నీట్‌లో అవకతవకలపై నిగ్గు తేల్చాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ సన్నల సాయిరాంరెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఏడాది జరిగిన నీట్ పరీక్షలో పేపర్ లీకేజీతో పాటు మార్కులు కలపడం వంటివి జరిగిందన్నారు. 24 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారని, ఇలా జరగడం దురదృష్టకరమన్నారు. దీనిపై ప్రధాని, ఆరోగ్యశాఖ మంత్రి స్పందించాలని కోరారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని కోరారు.

సుజలం...విఫలం!

- మూడేళ్లు నిర్వహణ బాధ్యతలు చూడాల్సి ఉన్నా తప్పుకున్న కాంట్రాక్టర్
- కాంట్రాక్టర్ నిర్వాకంతో మూతబడిన వాటర్ ప్లాంట్
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న గ్రామీణులు



మూతబడిన మదర్‌ప్లాంట్



నిరుపయోగంగా ఉన్న స్టీల్ ట్యాంకర్లు

కొలిమిగుండ్ల: ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం పేరుతో 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం గ్రామీణులకు స్వచ్ఛమైన నీరు అందించేందుకు ముందుకు వచ్చింది. రక్షిత నీరు రూ.2లకే ఏకంగా 20 లీటర్ల మినరల్ వాటర్ అందిస్తామంటూ ప్రచారం చేసుకుంది టీడీపీ సర్కార్. ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఏడు వాటర్‌ప్లాంట్‌లు మంజూరు చేయగా మండల కేంద్రం కొలిమిగుండ్ల కస్తూర్బా బాలికల పాఠశాల సమీపంలో వాటర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టారు. కొలిమిగుండ్ల ప్లాంట్‌ను ఇతర జిల్లాకు చెందిన కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ప్రతి గ్రామానికి మినరల్ వాటర్ అందించాలన్నది లక్ష్యంగా ప్లాంట్ నిర్మాణానికి రూ.3.79 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు అధికారులు. ఈ మేరకు కాంట్రాక్టర్లకు బాధ్యతలు అప్పగించారు. ఈకోవలోనే పాఠశాల సమీపంలోని ఐదు బోర్లుతోపాటు సంప్ నిర్మించారు. ఇక్కడ గంటకు పదివేల లీటర్ల సామర్థ్యంలో నీటిని శుద్ధి చేసే మదర్‌ప్లాంట్‌ను నిర్మించారు. అయితే నిధుల కొరత మూలంగా కాంట్రాక్టర్ పనులను మధ్యలో నిలిపివేశారు. అయితే 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సుజల పథకానికి నిధులు మంజూరు చేసి పెండింగ్ పనులను పూర్తి చేయించింది. ఎన్టీఆర్ సుజలంగా ఉన్న పేరు వైఎస్సార్ సుజలంగా మారింది. కొలిమిగుండ్లలో ఏర్పాటు చేసిన మదర్ ప్లాంట్ పనులను పూర్తి చేసి 2021లో ప్రారంభోత్సవం చేశారు. ఇంతవరకు బాగున్నా... టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు చేజిక్కించుకున్న కాంట్రాక్టర్ ఏడాది క్రితం చేతులెత్తాశాడు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. సుజలం విఫలం అన్నట్లుగా మారింది పరిస్థితి.

చేతులెత్తేసిన కాంట్రాక్టర్...

మినరల్ వాటర్ ప్లాంట్‌ను కాంట్రాక్టర్ పదేళ్ల పాటు నిర్వహణ చూసుకునేలా ఒప్పందం ఉంది. మదర్ ప్లాంట్‌లో తయారైన మినరల్ వాటర్‌ను ట్యాంకర్ల ద్వారా గ్రామ పంచాయితీల్లో ఏర్పాటు చేసిన ఆర్‌డీ(రిమోట్ డిస్పెనరీ)యూనిట్లకు సరఫరా చేస్తుండేవారు. అప్పట్లోనే మండలానికి ఐదు ట్యాంకర్లు మంజూరు అయ్యాయి. ఏటీఎం కార్డు తరహాలో ప్రజలకు మినరల్ వాటర్ పట్టుకునే అవకాశం కల్పించారు. మండల వ్యాప్తంగా 21 చోట్ల ఆర్‌డీ యూనిట్లు నిర్మించారు. ఏడాది నుంచి కాంట్రాక్టర్ చేతులెత్తేయడంతో వాటర్ ప్లాంట్ మూత బడింది. అగ్రిమెంట్ ప్రకారం కాంట్రాక్టర్‌కు ఇంకా మూడేళ్ల పాటు గడువు ఉన్నా నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. ఉద్దేశ పూర్వకంగానే కాంట్రాక్టర్ తప్పుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ప్లాంట్ మూత బడటంతో గ్రామీణులకు మినరల్ వాటర్ సౌకర్యం లేకుండా పోయింది.



నీటి కోసం నిర్మించిన సంప్

థర్డ్ పార్టీకి అప్పగించేందుకు చూస్తున్నాం

కాంట్రాక్టర్ గడువు ఉండగానే ఉపసంహరించుకోవడంతో ప్రస్తుతం వాటర్ ప్లాంట్ పని చేయడం లేదు. ప్లాంట్‌ను థర్డ్ పార్టీకి అప్పగించేందుకు ఆదేశాలు వచ్చాయి. ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నాం. థర్డ్‌పార్టీ అందుబాటులోకి వస్తే తిరిగి ప్లాంట్‌ను రీఓపెన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– సుబ్రహ్మణ్యం, ఆర్‌డబ్ల్యూఎస్,ఏఈ

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల: పట్టణంలోని హెల్ప్ స్వచ్ఛంద సేవా సంస్థ, సాయి కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు దస్తగిరి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పాసైన నిరుద్యోగ యువతి, యువకులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ ఫొటో, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో జూన్ 30లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు పాతబస్టాండులోని సాయి కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్‌లో సంప్రదించాలన్నారు.

నేడు గ్రామ పంచాయతీ పనుల వేలం

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీకి ఆదాయం చేకూర్చే వివిధ పనుల నిర్వహణకు బుధవారం వేలంపాట నిర్వహించనున్నట్లు ఈఓ గోపీనాథ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఏటా మార్చి నెలలో వేలం పాట జరుపుతుండగా ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల కోడ్ నేపథ్యంలో మూడు నెలల పాటు వాయిదా వేశామన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సంతమార్కెట్ గేటు వసూలు పనులకు ప్రాథమిక ధరావత్తు రూ.2.50 లక్షలు, దినమార్కెట్ పనులకు రూ. 2 లక్షలు, బస్టాండ్‌కు రూ. 2 లక్షలు, కమేళకు రూ. 7,500 ధరావత్తు నిర్ణయించామన్నారు. ఆసక్తిగల వ్యక్తులు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించే బహిరంగ వేలంపాటలో పాల్గొని పనులు దక్కించుకోవచ్చని సూచించారు.

మలేరియా కట్టడికి సహకారం అందించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కామేశ్వరరావు

బనగానపల్లె రూరల్ : మలేరియా వ్యాప్తి కట్టడికి ల్యాబ్ టెక్నిషియన్స్ తమవంతు సహకారం అందించాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వర రావు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ వందపడకల ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండ్ డాక్టర్ సుజాత ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నిషియన్స్‌కు రెండు రోజుల పాటు హ్యాండ్స్ ఆన్ శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ ల్యాబ్ టెక్నిషియన్స్ మలేరియా వ్యాప్తికి కారణమైన పరాన్నజీవులను మైక్రోస్కోపు ద్వారా క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. 2027వ సంవత్సరానికి మలేరియా రహిత జిల్లాగా ఉండేందుకు కృషి చేయాలన్నారు. మలేరియా సహాయ అధికారి వర ప్రసాదరెడ్డి మాట్లాడుతూ శిక్షణను ల్యాబ్ టెక్నిషియన్స్ సద్వినియోగం గా చేసుకోవాలని సూచించారు. శిక్షణ ముఖ్య ఉద్దేశ్యం, మైక్రోస్కోపు ముఖ్యభాగాలు, పని చేయు విధానం, రక్తపూతల సేకరణ, పరీక్ష చేయు విధానం, పరాన్నజీవులను ఏ విధంగా గుర్తించాలి తదితర అంశంలపై ఆరోగ్య విస్తర్ణాధికారి ఎస్ఆర్ విజయ్‌రెడ్డి, సబ్ యూనిట్ అధికారి ఎన్‌కే రత్నాచారి ల్యాబ్‌టెక్నిషియన్స్ సుబ్బలక్ష్మయ్య వివరించారు. కార్యక్రమంలో బనగానపల్లె, కొలిమిగుండ్ల, అవుకు, బేతంచర్ల మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహించే ల్యాబ్ టెక్నిషియన్స్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగును ప్రోత్సహించాలి



సిబ్బందితో చర్చిస్తున్న అంబుడ్స్ పర్సన్ సురేంద్రకుమార్

కొలిమిగుండ్ల: బోరు బావులు ఉన్న రైతులను పండ్లతోటల సాగు చేసేలా ప్రోత్సహించాలని ఉపాధి హామీ జిల్లా అంబుడ్స్ పర్సన్ సురేంద్రకుమార్ సూచించారు. మంగళవారం కొలిమిగుండ్లలో రైతులు సాగు చేసిన వివిధ పండ్ల తోటల సాగును పరిశీలించారు. అనంతరం స్థానిక ఎన్ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పండ్ల తోటల సాగు కోసం రాయితీలు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలానికి ఇచ్చిన 250 ఎకరాల టార్గెట్ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పండ్ల తోటల సాగు ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఉపాధి పనులకు అంతరాయం ఏర్పడిందన్నారు. ఈసారి కొత్తగా చేపట్టబోయే పనులపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపామన్నారు. కూలీలకు మూడు వారాలకు సంబంధించి వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ గంగన్న,సిబ్బంది పాల్గొన్నారు.

సీసీఏ రూల్స్‌పై కలెక్టరేట్ ఉద్యోగులకు అవగాహన



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

నంద్యాల: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తన నియమావళి, సీసీఏ, కండక్ట్ రూల్స్‌పై ప్రతి ఉద్యోగి సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి కలెక్టరేట్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సీసీఏ రూల్స్, కండక్ట్ రూల్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి పద్మజ, అన్ని సెక్షన్ల సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగి తన విధుల్లో విరుద్ధంగా ప్రవర్తించినా.. అతిక్రమించినా ఎలాంటి చర్యలు తీసుకోవాలి, విచారణకు అనుసరించాల్సిన విధివిధానాలపై క్షుణ్ణంగా తెలుసుకుని ఫైళ్లను సర్కులేట్ చేస్తే పైఅధికారులకు ఇబ్బందులు ఉండవని సూచించారు. గతంలో సీసీఏ రూల్స్ అతిక్రమించిన సిబ్బందికి విధించిన క్రమశిక్షణ చర్యల దస్త్రాలను పరిశీలించుకోవాలన్నారు. ప్రతి ఉద్యోగి హాజరు వేళలు, హాజరు రిజిస్టర్, కార్యాలయానికి ఆలస్యంగా హాజరవుట, పని వేళల్లో కార్యాలయాన్ని వదిలి వెళ్లిపోవుట, యాదృచ్ఛిక సెలవు, నిర్వహించాల్సిన రిజిస్టర్లు తదితర ప్రాథమిక సూత్రాలు తెలిసి ఉండాలన్నారు.

అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు కోరారు. మంగళవారం నంద్యాలలోని సీఐటీయూ కార్యాలయంలో సేబారాణి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించి సగం పెన్షన్ ఇవ్వాలని కోరారు. అదేవిధంగా అంగన్‌వాడీ సెంటర్లకు ట్రాన్స్‌పోర్టు చార్జీలు, మెను చార్జీలు పెంచాలని అధికారులను ఈ సందర్భంగా వారు కోరారు. సమావేశంలో నిర్మలమ్మ, వెంకటలక్ష్మి, రమణమ్మ, సునీత, నాగరాణి, సరస్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల బాహాబాహీ!

డోన్: ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి కార్యక్రమం వేదికగా తెలుగు తమ్ముళ్లు బాహాబాహీకి దిగారు. చెప్పులతో పరస్పర దాడులకు తెగబడ్డారు. డోన్ ఆర్టీసీ డిపోకు మంజూరైన రెండు కొత్త సూపర్ లగ్జరీ బస్సులను మంగళవారం ఎమ్మెల్యే కోట్ల ప్రకాష్‌రెడ్డి ప్రారంభించగా ఈ కార్యక్రమానికి వచ్చిన టీడీపీ నాయకులు ఘర్షణ పడ్డారు. మండల పరిధిలోని వెంకటాపురం, బొంతిరాళ్ల గ్రామాల టీడీపీ కార్యకర్తలు సత్యనారాయణశెట్టి, రామిరెడ్డి ఘర్షణ పడ్డారు. మాటామాటా పెరిగి పరస్పరం చెప్పులతో కొట్టుకున్నారు. అక్కడే బందోబస్తులో ఉన్న పోలీసులు ఇద్దరినీ విడిపించి పంపివేశారు.

అన్యాయంగా దాడి చేశారు...

- బాధితుడు సత్యనారాయణశెట్టి



తనపై అన్యాయంగా వెంకటాపురం గ్రామానికి చెందిన రామిరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి దాడి చేశారని బొంతిరాళ్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సత్యనారాయణశెట్టి విలేకరుల ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్యవైశ్యుడిని, 70 ఏళ్ల వృద్ధుడని చూడకుండా తనపై చెప్పులతో చాలాదారుణంగా దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. తాము ఏమీ చేయలేమని ధీమాతో కొట్టారని, ఎమ్మెల్యేతోపాటు పోలీసులు తనపై దాడికి పాల్పడిన వ్యక్తులను శిక్షించాలని కోరారు.

సూపర్ లగ్జరి బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే



డోన్ టౌన్ : డోన్ ఆర్టీసీ డిపోకు మంజూరైన రెండు కొత్త సూపర్ లగ్జరీ బస్సులను మంగళవారం ఎమ్మెల్యే కోట్ల ప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. ప్రతి రోజు రాత్రి 8.గంటలకు కర్నూలు మీదుగా డోన్ టు విజయవాడ, ప్రతి శనివారం మాత్రమే ఉదయం 8గంటలకు డోన్ టు తిరుపతి వీక్లీ స్పెషల్ సూపర్ లగ్జరీ సర్వీసులుగా వీటిని నడుపుతామని డీఎం శశిభూషణ్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ ట్రాఫిక్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ మోజీద్, ఎన్ఎంయూ డిపో కార్యదర్శి బాల మద్దయ్య, ఈయూ కార్యదర్శి ఐవీఆర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి బస్సులు కేటాయించాలి

డోన్ టౌన్ : ప్రతి గ్రామం నుంచి ప్రత్యేకంగా పాఠశాలు,కళాశాలకు విద్యార్థి బస్సులు ఏర్పాటు చేయాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు తెలుగు విజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కళాశాలలు, మోడల్ స్కూళ్లు, ఐటీఐ, అంబేడ్కర్,జ్యోతి రావుఫూలే గురుకుల పాఠశాలతో ప్రైవేట్ పాఠశాలలకు ప్రతి నిత్యం డోన్,ప్యాపిలి మండల గ్రామాలకు చెందిన విద్యార్థులు వస్తున్నారన్నారు. వీరి సౌకర్యార్థం ప్రతి గ్రామానికి విద్యార్థి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు.

సన్మానం

డోన్ టౌన్ : ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, కోట్ల సుజాతమ్మ దంపతులను ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈయూ డిపో కార్యదర్శి ఐవీఆర్‌రెడ్డి, నాయకులు రమణారెడ్డి, పెద్ద రాజులు, టీఎస్ రావు, ఓకే రెడ్డి, ఎస్ఎం బాషా, నవీన్ కుమార్, ప్రవీణ్‌కుమార్, రవిశంకర్, మౌలాలి తదితరులతో కలిసి మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి పుష్ప గుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు.

కొనసాగుతున్న ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లు

ప్యాపిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు కొనసాగుతున్నాయని ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం మంగళవారం తెలిపారు. ఎంపీసీలో 10 మంది, బైపీసీలో 15, సీఈసీలో 11, హెచ్ఈసీలో 9 మంది చొప్పున అడ్మిషన్లు పొందారన్నారు. అడ్మిషన్లు వచ్చే నెల వరకు కొనసాగుతాయని, పదో తరగతి సప్లిమెంటరీలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వసతులపై అవగాహన పెంచాలి



విద్యార్థికి అడ్మిషన్ పత్రాన్ని అందజేస్తున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

బనగానపల్లె రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను తల్లిదండ్రులకు అవగాహన పెంచాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి సూచించారు. మంగళవారం 'నేను బండికి పోతా' కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఇల్లూరుకొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలను డీఈఓ సుధాకర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న అదనపు తరగతి గదులను పరిశీలించి త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేయించాలని హెచ్ఎం సోమశేఖర్‌రెడ్డికి సూచించారు. 6వ తరగతి చేరేందుకు వచ్చిన విద్యార్థిని విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలను డీఈఓ సుధాకర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష అధికారి రఘురామిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెండేకంటి వెంకటసుబ్బయ్య జయంతి



పెండేకంటి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : స్థానిక వాసవి పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ రమణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల వ్యవస్థాపకుడు, మాజీ కేంద్ర మంత్రి దివంగత పెండేకంటి వెంకటసుబ్బయ్య జయంతిని నిర్వహించారు. వాసవీ అకాడమీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ రమణారెడ్డి, అధ్యాపకులు కళాశాలలోని పెండేకంటి విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. కేంద్ర మంత్రిగా, బీహార్, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్‌గా దివంగత పెండేకంటి వెంకటసుబ్బయ్య చేసిన సేవలను ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసులు గుర్తు చేశారు.

ఆటో వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

బేతంచెర్ల: స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆటో వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నాయకుడు మద్దిలేటి స్వామి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మండల ఆటో యూనియన్ కమిటీని ప్రకటించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా మద్దిలేటి, తిరుమలేష్, జాయింట్ సెక్రటరీలుగా పుల్లయ్య, వెంకటసుబ్బయ్య, దినేష్, వైస్ ప్రసిడెంట్‌లుగా మద్దయ్య, మద్దిలేటి, రామాంజనేయులు, సభ్యులుగా మనోజ్ రెడ్డి, సూరి, సాలయ్య, రవి, కరిముల్లా, మద్దిలేటిని ఎంపిక చేశారు.



కోవెలకుంట్లలో వర్షం కురుస్తున్న దృశ్యం



వర్షంతో జలమయమైన కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం

మళ్లీ వర్షం!

- ఉయ్యాలవాడలో 109.6మి.మీ వర్షపాతం
- ఖరీఫ్ సాగుకు వర్షం అడ్డంకి

కోవెలకుంట్ల: నైరుతి రుతు పవనాల ప్రభావంతో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో వర్షాల పరంపర కొనసాగుతోంది. మూడు రోజులపాటు తెరప ఇచ్చిన వర్షం మళ్లీ మంగళవారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమైంది. సబ్‌డివిజన్‌లోని ఉయ్యాలవాడ మండలంలో ఏకంగా 109.6 మి.మీ, దొర్నిపాడు - 44.2 మి.మీ, కోవెలకుంట్ల మండలంలో 18.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండ్‌లోకి వర్షపునీరు చేరింది. పంట పొలాల్లో భారీగా వర్షపునీరుచేరి కుంటలను తలపిస్తున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు వర్షాలు అనుకూలంగా మారిన వర్షాలు ఎడతెరపి లేకుండా కురుస్తుంటంతో విత్తన సాగుకు ఆటంకంగా మారటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మినుము, పెసర, కంది, మొక్కజొన్న, బెండ, ఆముదం తదితర పంటల సాగుకు అదును కావడంతో రైతులు సర్వం సిద్ధం చేసుకున్నారు.

వైభవంగా స్వాతి వేడుకలు



శ్రీదేవి, భూదేవి సమేత మద్దిలేటి నరసింహస్వామికి పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు



మద్దిలేటిస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయ ంలో స్వాతి వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు జ్వాలా చ క్రవర్తి, కల్యాణ చక్రవర్తిలు శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీమద్దిలేటి నరసింహస్వామికి సుప్రభాత సేవలు, ప్రత్యేక పూజలు, విశ్వక్సే నారాధన, వాసు దేవ పుణ్యాహవచనం, సుదర్శన హోమం, నవ కలశస్నపనం, నరసింహ హోమం ,పంచామృత సహిత విశేష ద్రవ్య తిరుమంజనం ,ధన్వంతరి మూల మంత్ర జపం నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, నైవేద్యాలు సమర్పించి మహా మంగళహారతి గావించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు మద్దిలేటి స్వామి, అర్చకుడు మనోహర్ పాల్గొన్నారు.

బనగానపల్లె రూరల్ : మండలంలో స్వాతి నక్షత్ర వేడుకలను మంగళవారం ఆలయాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నందవరం గ్రామంలో పూరాతన మద్దిలేటిస్వామి ఆలయంలో ఉదయం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, అర్చన తదితర ప్రత్యేక పూజలు జరిగాయి. అలాగే బనగానపల్లె పట్టణంలోని రవ్వలకొండపై వెలసిన పావన నరసింహాస్వామి ఆలయంలో ఆలయ వ్యవస్థాపకులు బాలిశెట్టి పావన నరసింహామూర్తి ఆధ్వర్యంలో స్వాతి నక్షత్ర ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.